క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠ మాస శుద్ధ నవమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ నేతృత్వంలో స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు సత్కారం


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును సత్కరిస్తున్న ఓం యోగా సెంటర్ ప్రతినిధులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ సమీపంలోని ఓం యోగా సెంటర్ ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో సెంటర్ ప్రతినిధులు, యోగా గురువులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


కార్మికులకు దుస్తులు అందజేస్తున్న కొల్లాబత్తుల శిరీష, కుటుంబ సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా బాపూజీనగర్‌లో ఆదివారం మాజీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొల్లాబత్తుల వెంగళరావు 57వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగళరావు భార్య రాజీ, కూమార్తెలు కొల్లాబత్తుల ప్రసన్న, శిరీష చేతుల మీదుగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మిక నాయకుడు నవరపు జయకుమార్ మాట్లాడుతూ వెంగళరావు సేవలు పారిశుధ్య కార్మికులు ఎన్నటికీ మరువలేమన్నారు. ముందుగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మంగరాజు, సాయి, అప్పారావు, నూకరాజు, రాజు, పి.లక్ష్మి, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 2కే రన్


2కే రన్‌లో పాల్గొన్న చార్టెర్డ్ అకౌంటెంట్లు

బీచ్‌రోడ్డు: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆదివారం నగరంలోని చార్టెర్డ్ అకౌంటెంట్లు వికసిత్ భారత్ పేరుతో 2కే రన్ ఉత్సాహంగా నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ రన్‌ను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా చైర్మన్ అనిర్బన్పాల్ ప్రారంభించారు. సీఏ డే సందర్భంగా ప్రధాని పిలుపు మేరకు ఈ రన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు, విద్యార్థులకు పుస్తక పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు.

మెరుగైన వైద్యం

- ప్రజల చెంతనే ఆరోగ్య కేంద్రం
- అందుబాటులో 62 రకాల వైద్య పరీక్షలు, 163 రకాల మందులు


చిన్నారికి చికిత్స చేస్తున్న డాక్టర్ మన్‌మోహన్



రేసపువానిపాలెంలో పట్టణ ఆరోగ్య కేంద్రం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తోంది. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ ఆఫీసర్, లేబ్ అసిస్టెంట్, స్టాఫ్ నర్సులు, ఎల్‌జీఎస్, మెడికల్ స్టాఫ్‌తో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు, సూచనలు అందిస్తున్నారు. అత్యవసర సమయాల్లోనూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. రోజుకు సుమారు 40 నుంచి 50 మంది వరకు రోగులు వస్తుంటారు. 62 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. మలేరియా, డెంగ్యూ, రక్త పరీక్షలు, హెచ్‌బీ, కిడ్నీపాటుతో ఇతర టెస్ట్‌లు చేస్తుంటారు. రోగులకు 163 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నారు. కొత్తగా లేబ్ టెస్ట్ మిషన్ అందుబాటులోకి వచ్చింది. కరోనా టెస్ట్‌లు చేసి పాజిటివ్ వస్తే వారికి కిట్లు అందించి పర్యవేక్షణలో ఉంటారు. ప్రతి బుధ, శనివారాలు పిల్లలు, గర్భిణులకు టీకాలు వేస్తుంటారు.

ప్రత్యేక వైద్యాధికారి పర్యవేక్షణ

ప్రతి రోజు ప్రత్యేక వైద్యాధికారి వైద్య సేవలను పర్యవేక్షిస్తుంటారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మన్‌మోహన్ అందుబాటులో ఉంటూ రోగులకు సేవలందిస్తుంటారు.

శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. 24వ వార్డు(ఐదు సచివాలయాలు), 22వ వార్డు(ఏడు సచివాలయాలు), 25వ వార్డు(రెండు సచివాలయాలు)లకు సంబంధించిన ప్రజలు ఈ ఆరోగ్య కేంద్రానికి వచ్చి ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు.


ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న అసిస్టెంట్


ఫ్రంట్ ఆఫీస్‌లో రోగుల వివరాలు నమోదు చేస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది


విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

మా ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ అత్యవసర సమయంలో కూడా అందుబాటులో ఉంటున్నాం. రోగులకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, మందులు అందిస్తున్నాం.

– డాక్టర్ మన్‌మోహన్, వైద్యాధికారి

కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం


ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయం ఎదురుగా ఉన్న స్థలంలో ఉన్న చెట్టు ఒక్కసారిగా కూలిపోయింది. ఆదివారం సాయంత్రం సంభవించిన ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. చెట్టు మొత్తం రోడ్డుకు అడ్డంగా లైబ్రరీ గోడపై పడింది. ఆ సమయంలో చెట్టు నీడలో కూర్చున్న లైబ్రరీ సెక్యూరిటీ గార్డు అప్పుడే లేచి పక్కకు వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం కావడంతో విద్యార్థులు పెద్దగా రాకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని అంతా ఊపిరి పీల్చుకున్నారు. రహదారికి అడ్డుగా చెట్టు కూలడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. చీకటి పడినా చెట్టు తొలగించక పోవడంతో పబ్లిక్ లైబ్రరీకి వచ్చే వారు ఇబ్బందులకు గురయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్టు తొలగింపు చర్యలు వెంటనే చేపట్టాలని లైబ్రరీ సిబ్బంది కోరుతున్నారు.

నక్కవానిపాలెం గ్రామ అధ్యక్షుడిగా గుడ్ల కాటరాజురెడ్డి


ఉమా నీలకంఠేశ్వరాలయంలో పూజలు చేస్తున్న గుడ్ల కాటరాజురెడ్డి, నాయకులు


నక్కవానిపాలెం గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు

సీతమ్మధార: నక్కవానిపాలెం గ్రామ కమిటీ ఎన్నికల్లో గుడ్ల కాటరాజురెడ్డి అధ్యక్షుడిగా గెలుపొందారు. గ్రామం దొడ్డి పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎన్నికలు నిర్వహించారు. ప్రెసిడెంట్ పదవికి గుడ్ల కాటరాజురెడ్డి, దుంగి చంద్రగిరి రెడ్డి పోటీ చేశారు. కాటరాజురెడ్డికి 619 ఓట్లు, చంద్రగిరి రెడ్డికి 253 ఓట్లు వచ్చాయి. పది చెల్లని ఓట్లు పడ్డాయి. 366 ఓట్ల మెజారిటీతో కాటరాజురెడ్డి విజయం సాధించినట్లు గ్రామ దొడ్డి పెద్దలు ప్రకటించారు. ఇద్దరు బంధువులు కావడం విశేషం. గ్రామ ప్రజలు నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో గుడ్ల కాటరాజురెడ్డి పూజలు చేశారు. గ్రామ సెక్రటరీగా కారపు శ్యామలరావు, కోశాధికారిగా ధర్మాల గురుమూర్తిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ దొడ్డి పెద్దలు ఎండ్రెడ్డి వెంకటేష్, నక్క అప్పలరెడ్డి, దుంగి సాంబశివరెడ్డి, పిడింట్ల రమేష్‌రెడ్డి ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో డి.వి.ఎస్.ప్రసాద్‌రెడ్డి, గుడ్ల శ్రీను, గుజ్జు లోకేష్‌రెడ్డి, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త మహాలక్ష్మి పండగ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధారలో కొలువైన కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సనపల బంగారురాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన పర్యవేక్షణలో వేకువజాము నుంచి ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మాచవరపు యామిని, ఇతర వైద్య శిబ్బంది పాల్గొని 186 మందికి బీపీ, సుగర్, కంటి, ఈసీజీ మొదలగు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యామిని మాట్లాడుతూ నిరంతర వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మంచి పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. మంచినీటి ద్వారా సగం వ్యాధులు నయమవుతాయని వివరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి ప్రసాదరావు, జాలీవాకర్ ఎన్.ప్రకాశరావు, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, సత్తి సునీల్‌రెడ్డి, కె.ద్వారకానాథ్, కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, వి.అప్పారావు, ఎస్.రామమోహన్ శిబిరం నిర్వహణకు సహకరించారు.

మర్యాదపూర్వక కలయిక


విజయవాడ ఎం.పి.కేశినేని శివనాథ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విశాఖ పర్యటనలో భాగంగా ఆదివారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు. వీరిద్దరు కాసేపు పలు విషయాలపై చర్చించారు.

కిడ్స్ ఫ్యాషన్ షో అదుర్స్


సీజన్- 4 మెగా ఫైనల్‌లో ఫ్యాషన్ వాక్‌తో అలరిస్తున్న జూనియర్ మోడల్

మద్దిలపాలెం: క్వీన్స్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో జూనియర్ మోడల్ సీజన్-4 మెగా ఫైనల్ ఘనంగా జరిగింది. మద్దిలపాలెం దగ్గరలోని ఓ ఫంక్షన్ హాల్‌లో క్వీన్ ఈవెంట్స్ నిర్వాహకురాలు ఉషారాణి ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఆడిషన్లు నిర్వహించగా.. 100 మంది పిల్లలు హాజరయ్యారని, వారిలో 30 మందిని ఎంపిక చేశామని తెలిపారు. ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహించామన్నారు. ముఖ్య అతిథి మిసెస్ ఇండియా పుష్ప లోకేష్, మిసెస్ కర్నాటక చందన మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న జిజ్ఞాసను వెలికి తీసి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాక్ రౌండ్, టాలెంట్ షో ఎంతగానో ఆకట్టుకున్నాయి. జూనియర్ మోడళ్లు తమ ఫ్యాషన్ వాక్‌తో అలరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ ధర్మేంద్ర


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఐదో పట్టణ ఎస్‌ఐ దివ్యభారతి

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. సమాజంలో ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, రౌడీషీటర్లంతా మంచిగా నడుచుకోవాలని ఎస్‌ఐ ధర్మేంద్ర హితవు పలికారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఉమెన్ ఎస్‌ఐ దివ్యభారతి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి గొడవలు, అల్లర్లు సృష్టించినా ఊరుకునేది లేదని, వాటి జోలికి వెళ్లకుండా ఉండాలన్నారు. పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని ఎస్‌ఐ సూచించారు. అందరూ కుటుంబంతో కలిసి హాయిగా గడపాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు సహకారం

తాటిచెట్లపాలెం: నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కోసం ఫర్హాన్ రషీద్ ఫ్రీలాన్స్ రిక్రూట్‌మెంట్ సంస్థ తోడ్పాటు అందిస్తోందని సంస్థ ప్రతినిధి ఫర్హాన్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరం, రాష్ట్రం, దేశంలో అర్హులైన అభ్యర్థులకు సరైన పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు తమ సంస్థ అభ్యర్థులను సరైన విధానంలో తీర్చిదిద్దుతుందన్నారు. నిరుద్యోగులు – యాజమాన్యం మధ్య అంతరాలను తొలగించి, ప్రతీ వ్యక్తికి వారి నైపుణ్యాలు, అర్హతలు, ఆకాంక్షలకు అనుగుణంగా సహకరించడమే తమ సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. వివిధ సంస్థలు, పరిశ్రమల్లో ఉద్యోగాల కోసం సిద్ధపడుతున్న వారికి మద్దతు, మార్గదర్శకం చేస్తున్నట్టు తెలిపారు. రెజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూకు సిద్ధపాటు, కెరీర్ కౌన్సెలింగ్ వంటి విషయాల్లో నిరుద్యోగులకు సహాయ సహకారాలు అందించి, సరైన ఉద్యోగాలను వారిని పంపించడం తమ ఉద్దేశమన్నారు. వివరాలను hr@farhanrasheed.com, www.farhanrasheed.com ఈ మెయిల్, వెబ్‌సైట్‌ల్లో తెలుసుకోవచ్చని, సందేహాలుంటే 99665 94448 నంబర్‌లో సంప్రదించాలని ఫర్హాన్ కోరారు.

పూడిక తరలించండి


చిన్నూరు చోటీ బస్తీ వద్ద పూడికలు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం చిన్నూరు చోటీ బస్తీ వద్ద గెడ్డలో తొలగించిన పూడికను రోడ్డుపై కుప్పలుగా పడవేశారు. వారం రోజులు గడిచినా దానిని తరలించడం మరిచారు. పూడిక నుంచి వస్తున్న దుర్వాసన, మురుగు నీరుతో పరిసర ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురుస్తున్నందున పూడిక మళ్లీ గెడ్డలో చేరే అవకాశముందని, త్వరగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వాహనాల రాకతో ఆందోళన


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో లారీ పైనుంచి కిందికి దింపుతున్న పొక్లెయిన్

సీతమ్మధార: ప్రతి రోజూ రద్దీగా ఉండే బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం ఎదురుగా గల రోడ్డులో ఆదివారం భారీ లారీ నుంచి పొక్లెయిన్‌ను ప్రమాదకరంగా కిందికి దించారు. పొక్లెయిన్‌ను దించుతుండగా లారీ ముందు భాగం ఒక్కసారిగా పైకి లేవడంతో దానిముందు ద్విచక్ర వాహనంపై ఉన్న కుటుంబ సభ్యులు ఉలిక్కిపడి భయభ్రాంతులకు గురయ్యారు. రద్దీగా ఉండే ప్రాంతంలోకి లారీలు రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి భారీ వాహనాలు రాకుండా చూడాలని కోరుతున్నారు.

వృథాగా పోతున్న తాగునీరు


ఏఎస్సార్ నగర్‌లో ట్యాంక్ నుంచి లీకవుతున్న నీరు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లో తాగునీరు వృథాగా పోతోంది. ఈ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో గృహ వినియోగదారులకు తాగునీటి నిల్వ కోసం ట్యాంక్ నిర్మించారు. దాని నుంచి ఆయా బ్లాక్‌లకు నీటిని సరఫరా చేస్తుంటారు. బ్లాక్‌లకు సరఫరా చేసే పైప్‌లైన్ దెబ్బతినడంతో ట్యాంక్ నుంచి మంచినీరు లీకవుతోంది. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నాటక రంగానికి చేయూతనివ్వండి


ప్రేక్షకులను అలరిస్తున్న భక్తప్రహ్లాద నాటకంలోని ఓ అద్భుత ఘట్టం

మద్దిలపాలెం: ప్రతి ఒక్కరూ పౌరాణిక నాటకాలకు చేయూతనివ్వాలని కళాభారతి అధ్యక్షుడు, ఎస్ఆర్‌కే ఇన్ఫ్రా ప్రాజెక్ట్ చైర్మన్ ఎం.ఎస్.ఎన్. రాజు పిలుపునిచ్చారు. శ్రీ భానోదయ నాట్య మండలి (సురభి, హైదరాబాద్) 140వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం కళాభారతి పద్మశ్రీ సురభి బాబ్జి కళా ప్రాంగణంలో భక్త ప్రహ్లాద నాటకం ప్రదర్శించారు. రంగసాయి నాటక సంఘం ఆవిష్కర్త బాదంగీర్ సాయి, కళాభారతి యాజమాన్యం సహకారంతో రంగసాయి మీడియా ఏర్పాటు చేసిన రెండవ రోజు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రేపటి తరానికి మన సంస్కృతిని అందివ్వాలన్నారు. బాదంగీర్ సాయి అందిస్తున్న కళాదీప్తిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాదంగీర్ సాయి మాట్లాడుతూ కళా ప్రోత్సాహకులే రాజపోషకులుగా నాటక రంగం మనుగడ సాగించాలని ఆశించారు. ప్రత్యేక అతిథులుగా కళాభారతి కార్యదర్శి రాంబాబు, ట్రస్టీలు మల్లికా మనోజ్, రామ్‌గోపాల్, ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ అధికారులు నాగరాజారావు, ఎంవీ సుబ్రహ్మణ్యం, సినీ దర్శకులు అకిరి సురేష్, రంగస్థల నటులు వర్రే నాంచారయ్య, సినీ రచయిత రవి బ్రహ్మ, రిటైర్డ్ ఏడీజే డాక్టర్ పీజే సుధాకర్, నటుడు, నిర్మాత డాక్టర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతంగా భక్తప్రహ్లాద నాటక ప్రదర్శన..

శ్రీ భానోదయ నాట్య మండలి (సురభి) సంస్థ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకం నాటక ప్రియులను ఆద్యంతం అలరించింది. ప్రదర్శనకు ఆడిటోరియం నిండిపోవటం చూస్తే నాటకాలకు ఆదరణ లేదనే మాట సరికాదని అర్థమవుతోంది. చక్కటి లైటింగ్, టెక్నిక్, కళాకారుల నటనా చాతుర్యంతో నాటక ప్రదర్శన అద్భుతంగా సాగింది.

రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖలో పనిచేసిన టైపిస్ట్ జి.ప్రతిభా భారతి సేవలు ప్రశంసనీయమని ఆ శాఖ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్ అన్నారు. 28 ఏళ్ల పాటు సేవలందించి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మణిరామ్ మాట్లాడుతూ ప్రతిభా భారతి ఎన్నో ముఖ్య సంఘటనల్లో కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలందిస్తూ మంచి పనితీరు కనబరిచారని అన్నారు. అనంతరం ఆమెను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

డ్రైవర్ అలీకి సత్కారం

విశాఖ సమాచార పౌర సంబంధాల కార్యాలయం, ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజినీరింగ్ కార్యాలయం పరిధిలో సుదీర్ఘ కాలం పని చేసి అనకాపల్లి బదిలీపై వెళ్లిపోయిన డ్రైవర్ ఎస్.కె. అలీ ఆదివారం పదవీ విరమణ చేశారు. ఆయనను సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సత్కరించారు.